నిర్మించినా.. నిరుపయోగమే

- వీధి వ్యాపారుల కోసం షెడ్లు ఏర్పాటు
- నాలుగేళ్లుగా కేటాయించని వైనం
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు


డిపో వద్ద ఏర్పాటు చేసిన షెడ్లు

మెట్‌పల్లి: పట్టణంలోని ఆర్టీసీ డిపో వద్ద వీధి వ్యాపారుల కోసం ప్రత్యేకంగా షెడ్లు నిర్మించారు. రూ.5 లక్షల మున్సిపల్ నిధులతో మొదట 25 మంది వ్యాపారులకు ఉపయోగపడేలా వీటిని ఏర్పాటు చేశారు. కొన్నేళ్ల క్రితం నిర్మించిన వీటిని ఇంతవరకు వారికి కేటాయించలేదు. దీంతో అవి అప్పటి నుంచి నిరుపయోగంగానే ఉంటున్నాయి. రూ.లక్షలతో నిర్మించిన షెడ్లను ఇలా వృథాగా ఉంచడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

నాలుగేళ్ల క్రితం ఏర్పాటు..

- రోజురోజుకు విస్తరిస్తున్న పట్టణంలో వీధి వ్యాపారుల సంఖ్య కూడా పెరుగుతోంది.
- ఎక్కడి పడితే అక్కడ తోపుడు బండ్లు పెట్టుకుని వ్యాపారాలు చేస్తుండడం వల్ల అనేక సమస్యలు ముఖ్యంగా ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి.
- వీటిని దృష్టిలో పెట్టుకుని వారి కోసం పట్టణ ప్రాంతాల్లో ప్రత్యేకంగా స్థలాలు కేటాయించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.
- దీనిలో భాగంగా స్థానిక అధికారులు ఆర్టీసీ డిపో వద్ద స్థలం ఎంపిక చేసి ప్రత్యేకంగా షెడ్లు నిర్మించారు. మొదట 25 మందికి ఉపయోగపడేలా ఏర్పాటు చేశారు.
- నాలుగేళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఇంతవరకు ఎవరికి కేటాయించకపోవడంతో వృథాగా ఉంటున్నాయి.

అనుకూలంగా లేవని...

- డిపో వద్ద ఏర్పాటు చేసిన షెడ్లు అనుకూలంగా లేవనే కారణంతో వ్యాపారులు ముందుకు రావడం లేదని తెలిసింది.
- ఆ ప్రాంతంలో జనం రద్దీ తక్కువగా ఉంటుందని, దీనివల్ల ఆశించిన స్థాయిలో వ్యాపారాలు నడిచే అవకాశముండదనే భావనలో వారు ఉన్నట్లు సమాచారం.
- అధికారుల అనాలోచిత చర్యతో ప్రజాధనం వృథా అయిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.
- ఉన్నతాధికారులు స్పందించి ఇప్పటికైనా వాటిని వినియోగంలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలనే పట్టణ ప్రజలు కోరుతున్నారు.

దృష్టి సారిస్తాం

ఆర్టీసీ డిపో వద్ద ఏర్పాటు చేసిన షెడ్లు వీధి వ్యాపారులకు కేటాయించాలి. నిరుపయోగంగా ఉంటున్న విషయం నా దృష్టికి రాలేదు. తొందరలోనే వ్యాపారులను ఎంపిక చేసి కేటాయించేలా చర్యలు తీసుకుంటాం.

– మోహన్, మున్సిపల్ కమిషనర్

క్లుప్తంగా

హోం మంత్రి అమిత్‌షా క్షమాపణ చెప్పాలి


ఆందోళన చేస్తున్న దళిత నాయకులు

జగిత్యాల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించే విధంగా వ్యాఖ్యలు చేసి కేంద్ర హోంమంత్రి అమిత్‌షా తక్షణమే ప్రజలకు క్షమాపణ చెప్పాలని దళిత సంఘాలు డిమాండ్ చేశాయి. జిల్లా కేంద్రంలో ఆదివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత అమిత్‌షా వ్యాఖ్యలను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో రాజకుమార్, శేఖర్ పాల్గొన్నారు.

పశువైద్యాధికారికి జాతీయ అవార్డు


అవార్డు అందుకుంటున్న పశువైద్యాధికారి

మెట్‌పల్లిరూరల్: పశు వైద్యంలో ఉత్తమ సేవలకు మెట్‌పల్లి మండల పశువైద్యాధికారి మనీషాకు జాతీయ అవార్డు దక్కింది. గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ–గాంధీజ్ఞాన్ ప్రతిష్టాన్ యాదాద్రిలో ఆదివారం నిర్వహించిన జాతీయ సదస్సులో ఆమె 'కిసాన్ సేవా రత్న' జాతీయ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమెను పలువురు అభినందించారు.

దొంగమల్లన్న సేవలో విప్ అడ్లూరి


తులాభారంలో విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్

వెల్గటూర్: మండలంలోని మల్లన్నపేటలో జరుగుతున్న దొంగమల్లన్న జాతర సందర్భంగా ఆదివారం ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి నిలువెత్తు బంగారం సమర్పించి, ఆ ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముస్కు నిశాంత్‌రెడ్డి, పాల్గొన్నారు.

రాష్ట్రపతి ఉత్తర్వులతోనే 317 జీవో సవరణ


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాల: గత ప్రభుత్వం తీసుకువచ్చి 317 జీవో ద్వారా ఉద్యోగ, ఉపాధ్యాయులు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారని, రాష్ట్రపతి ఉత్తర్వుల సవరణతోనే దీనికి శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఎస్టీయూ భవన్‌లో వారు రూపొందించిన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మచ్చ శంకర్, భైరం హరికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్‌పై అక్రమంగా కేసులు పెట్టడం సరికాదు

కథలాపూర్: మాజీ మంత్రి కేటీఆర్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమంగా కేసులు పెట్టడం సరికాదని మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచిన ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు. ప్రభుత్వంపై ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతను కప్పి పుచ్చుకునేందుకు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తుందని మండిపడ్డారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు బద్దం మహేందర్, శేఖర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, గంగా రెడ్డి పాల్గొన్నారు.

నవగ్రహాల మండప నిర్మాణానికి భూమిపూజ

మల్లాపూర్: మండలంలోని వెంకట్రావ్‌పేటలో ఆదివారం ఆలయ కమిటీ, గ్రామ పెద్దమనుషుల నేతృత్వంలో శ్రీ లక్ష్మీనర్సింహస్వామి ఆలయ ఆవరణలో నవగ్రహాల మండప నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. గెల్లి మల్లేశ్–రజిత దంపతులు అందించిన రూ.1.60 లక్షల విరాళంతోనే మండప నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ఉత్సవాల్లో మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, మహిళా మండలి సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వెంకట స్వామి సేవలు మరువలేనివి


నివాళి అర్పిస్తున్న దళిత నాయకులు

కోరుట్ల: కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గడ్డం వెంకట స్వామి సేవలు మరువలేనివని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. వెంకట స్వామి వర్ధంతి సందర్భంగా ఆదివారం జువ్వాడి భవన్‌లో ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు.

మాల యువజన సంఘం ఆధ్వర్యంలో..

పట్టణంలోని మాల యువజన సంఘం ఆధ్వర్యంలో కాకా వెంకట స్వామి, పీవీ ల వర్ధతిని నిర్వహించారు. వారి చిత్ర పటాలకు పూల మాలలు వేసి నివాళి అర్పించారు.

మేడిపల్లి: మేడిపల్లి–భీమారం మండల కేంద్రంతో పాటు, పలు గ్రామాల్లో కాకా వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో మాల మహానాడు పాల్గొన్నారు.

ధర్మపురి: కాకా వర్ధంతి సందర్భంగాపట్టణంలోని నంది కూడలి వద్ద ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వెంకటస్వామి చిత్రపటానికి పూలమాల లేసి నివాళులర్పించారు.

వైద్యులకు అన్ని విధాల సహకరిస్తాం


మాట్లాడుతున్న జువ్వాడి నర్సింగరావు

కోరుట్ల: కోరుట్ల, మెట్‌పల్లిలోని వైద్యులకు అన్ని విధాల సహకారం అందిస్తానని కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. గైనిక్ సొసైటీ ఆధ్వర్యంలో ఉమెన్ ప్రొటెక్షన్ సెల్ ఏర్పాటు చేసి మహిళా బాధితులకు అన్ని అండగా ఉంటామని నర్సింగరావు అన్నారు. పట్టణంలో కోరుట్ల, మెట్‌పల్లి అబ్‌స్ట్రిషన్ అండ్ గైనకాలజిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం కోరుట్లలో నిర్వహించారు. కార్యక్రమానికి మెట్‌పల్లి ఆర్డీవో నక్క శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కేఎంఓజీఎస్ అధ్యక్షురాలు స్వాతి అనూప్ మాట్లాడుతూ మహిళలు, గర్భిణి స్త్రీల ఆరోగ్యం పట్ల ప్రత్యేక దృష్టి సారిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గైనకాలజిస్ట్ సంఘం అధ్యక్షుడు నర్సింహారెడ్డి, కార్యదర్శి అరుణ సుమన్, కోరుట,మెట్‌పల్లి ఐఎంఏ అధ్యక్షులు రాజేష్, గంగాసాగర్, స్టేట్ కౌన్సిల్ మెంబర్ అనూప్ రావు, వైద్యులు పాల్గొన్నారు.

సీఎం కప్ జిల్లా క్రీడాకారుల ఎంపిక



కోరుట్ల రూరల్: పట్టణంలోని వివేకానంద మినీ స్టేడియంలో ఆదివారం సీఎం కప్ జిల్లా స్థాయి క్రీడాకారులను ఎంపిక చేశారు.100 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొనగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లా స్థాయి క్రీడాకారులుగా ఎంపిక చేశారు. ఈ నెల 31 నుంచి జనవరి 2 వ తేదీ వరకు హైదరాబాద్ సరూర్‌నగర్ స్టేడియంలో రాష్ట్ర స్థాయిలో నిర్వహించే పోటీల్లో ఈ క్రీడాకారులు పాల్గొంటారని డీవైఎస్‌వో రవికుమార్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రెసిడెంట్ నవీన్ కుమార్, కాంగ్రెస్ నాయకుడు అన్నం అనిల్, కౌన్సిలర్ లక్ష్మీనారాయణ, కొక్కుల రాజేశ్ పాల్గొన్నారు.

జగిత్యాల: విద్యార్థులు క్రీడల్లో పాల్గొనాలని క్రీడల శాఖ అధికారి రవికుమార్ అన్నారు. ఆదివారం వివేకానంద స్టేడియంలో సీఎం కప్ 2024 క్రీడల్లో భాగంగా తైక్వాండ్, కరాటే పోటీలు ప్రారంభించి మాట్లాడారు. జిల్లా స్థాయి క్రీడల్లో ఎంపికైన వారిని రాష్ట్రస్థాయికి పంపిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే


లబ్ధిదారుల వివరాలు సేకరిస్తున్న అధికారులు

మల్యాల: ప్రజాపాలనలో ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి ఇళ్లకు వెళ్లి అధికారులు సర్వే చేస్తున్నారు. 19 గ్రామాల్లో ఇళ్ల కోసం 9408 మంది దరఖాస్తు చేసుకున్నారు. అధికారులు ఇల్లు లేని నిరుపేదల ఇంటికి వెళ్లి, ప్రస్తుతం లబ్ధిదారులు ఉంటున్న ఇంటి వివరాలు, ఇంటి ఫొటో ఆధారంగా సేకరిస్తున్నారు. లబ్ధిదారుల ఫొటో తీసుకుని, వారికి సంబంధించిన విద్యుత్ బిల్లు, ఇంటి పన్ను బిల్లు, రిజిస్ట్రేషన్ పత్రాలు, పట్టాదారు పాసు పుస్తకంలో ఏదీ అందుబాటులో ఉంటే అది ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తూ, లబ్ధిదారుల జాబితాను రూపొందిస్తున్నారు. మండలంలో 40 శాతం ఇందిరమ్మ ఇళ్ల కోసం సర్వే పూర్తయిందని, గొల్లపల్లిలో సర్వే పూర్తయిందని ఎంపీడీవో స్వాతి తెలిపారు.

కేజీవీల్స్‌తో ట్రాక్టర్లు నడిపితే సీజ్ చేస్తాం

పెగడపల్లి: మండలంలోని తారురోడ్లపై కేజీవీల్స్‌తో ట్రాక్టర్లను తిప్పితే సీజ్ చేస్తామని ఎస్సై రవికిరణ్ ట్రాక్టర్ల యాజమానులను హెచ్చరించారు. పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఆయన మాట్లాడుతూ కేజీ వీల్స్‌తో ట్రాక్టర్లను తారు రోడ్లపై తిప్పడం వల్ల రూ. కోట్ల వ్యయంతో నిర్మించిన రహదారులు ధ్వంసమై ప్రజాధనం వృథాగా పోతుందన్నారు. తారు రోడ్లపై కేజీవీల్స్‌తో ట్రాక్టర్లు నడిపితే కేసులు నమోదు చేస్తామని తెలిపారు. తారు రోడ్లపై కీజీవీల్‌తో ట్రాక్టర్లు నడుపుతుంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్సై కోరారు.

శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలి

మల్లాపూర్: శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలని ఎస్సై రాజు అన్నారు. ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై కొనన రాజును వాల్గొండ సర్పంచ్ ఎండీ.జమాల్ నేతృత్వంలో కాంగ్రెస్ నాయకులు, అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా నాయకులు ఎర్ర రమేశ్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు క్యాతం వెంకట్‌రెడ్డి, బోరగల్ల రవి, పనాస రవి, శీలం రవి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత నేత్ర వైద్యశిబిరం

కథలాపూర్: మండలంలోని అంబారిపేటలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ప్రతినిధులు సంజీవ్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు ఈ వైద్యశిబిరంను వినియోగించుకోవాలని వారు కోరారు. ఆపరేషన్ అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్ చేయిస్తామని తెలిపారు.

టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్షుడిగా శివకృష్ణ

ఇబ్రహీంపట్నం: తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(టీఎస్‌యూటీఎఫ్) మండల అధ్యక్షుడిగా మండలంలోని వర్షకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు దస్తరి శివకృష్ణ ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల ప్రధాన కార్యదర్శిగా గుగ్లావత్ తిరుపతినాయక్, ఉపాధ్యక్షులుగా మమత, వేణు, గోపాల్, కోశాధికారిగా ఇమ్మానుయేల్, కార్యదర్శులుగా మహేశ్, మాధురి, ఆడిట్ కన్వీనర్‌గా నరేశ్, ఎండీ ఇబ్రహీం ఎన్నికైనట్లు శివకృష్ణ తెలిపారు.

అరుదైన శస్త్ర చికిత్స

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని సులోచన ఆస్పత్రిలో అరుదైన చికిత్సను ఆదివారం వైద్యులు నిర్వహించారు. జగిత్యాలకు చెందిన ఓ యువకుడు సులోచనా ఆస్పత్రిలో చేరారు. వైద్యులు ఆకుతోట శ్రీనివాస్‌రెడ్డి పరీక్షించి బాధితుడి కడుపులో కంతి ఉన్నట్లు గుర్తించారు. డాక్టర్ ఆకుతోట శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో రోగికి శస్త్రచికిత్స నిర్వహించి 2.5 కిలోల బరువు గల ప్లీహం (కంతిని) తొలగించారు. ప్రస్తుతం రోగికి ఏలాంటి ప్రాణాపాయం లేదని శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

మార్కెట్ చైర్మన్‌కు సన్మానం

మేడిపల్లి: వేములవాడ మార్కెట్ కమిటీ చైర్మన్ గా నియమితులైన రొండి రాజు, వైస్ చైర్మన్ కనికారపు రాకేశ్‌ను టీపీసీసీ గల్ఫ్ కన్వీనర్ సింగిరెడ్డి నరేశ్ రెడ్డి ఆదివారం సన్మానించారు. కార్యక్రమంలో మేడిపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మాదం వినోద్ యాదవ్, కథలాపూర్ మండల అధ్యక్షుడు కాయితి నాగరాజు, కథలాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పులి శిరీష – హరిప్రసాద్, లచ్చు నాయక్, గడ్డం జలందర్ ఉన్నారు.

సీపీఐ ఆవిర్భావ ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి

కోరుట్ల: సీపీఐ శతాబ్ది ఆవిర్భావ ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని సీపీఐ నాయకులు అన్నారు. ఈ మేరకు పట్టణంలోని సి. ప్రభాకర్ స్మారక భవనంలో ఆదివారం నాయకులు కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ఈ నెల 26 న సీపీఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కోరుట్ల పట్టణంతో పాటు గ్రామాల్లో సీపీఐ జెండాలు ఎగురవేయాలని కోరారు. పార్టీకి పూర్వ వైభవం తెచ్చేందుకు కార్మికులు, కర్షకులను సభ్యులుగా చేర్చుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు చెన్న విశ్వనాథం, సుతారి రాములు, ముఖ్రం, మౌలానా, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఓమన్‌లో ఉద్యోగాలకు ఉచిత వీసా

మెట్‌పల్లి: ఓమన్ దేశంలో ఉద్యోగాలకు అర్హులైన వారికి ఉచితంగా వీసా ఇవ్వబడుతోందని పట్టణంలోని ఎస్ఎల్ ఇంటర్నేషనల్ మ్యాన్ పవర్ రిక్రూటింగ్ కన్సల్టెన్సీ నిర్వాహకులు చౌటుపల్లి శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. ఆ దేశంలో ఖాళీగా ఉన్న క్లీనర్స్ ఉద్యోగాలకు కన్సల్టెన్సీలో మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. ఎంపికైన వారికి ఉచితంగా వీసా, ఫ్లైట్ టిక్కెట్ కల్పిస్తామని, ఆసక్తి గల నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

సత్యసాయి బాబా మందిరం ప్రారంభం


మందిరం ప్రారంభిస్తున్న భక్తులు

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలో శ్రీ భగవన్ సత్యసాయి బాబా దేవాలయాన్ని సత్యసాయి బాబా సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్‌రావు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులం, మతం ఒకటేనని తెలిపారు. అందరినీ ప్రేమించాలి, అందరిని సేవించాలని సత్యసాయిబాబా చెప్పారని తెలిపారు. పేద దనిక భేదం లేదని, ఎదుటి వ్యక్తితో మనసు పెట్టి మాట్లాడితే చాలు అని తెలిపారు. ప్రతి ఒక్కరికి దైవభక్తి ఉండాలన్నారు. కార్యక్రమంలో సత్యసాయి సేవాసమితి జిల్లా అధ్యక్షులు విలేశ్వర్, మండల కన్వీనర్ గూడ రమేష్, కో కన్వీనర్ గంట శ్రీనివాస్‌రావు, దొంతుల హరిష్, గణేశ్, భక్తులు పాల్గొన్నారు.

మల్లెగుట్టపై పట్నాలు



మల్యాల: మండల కేంద్రంలోని శ్రీ మల్లికార్జున స్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. వివిధ గ్రామాల నుంచి వందలాదిమంది తరలివచ్చి, స్వామివారికి బోనాలతో నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మల్లికార్జున స్వామి సన్నిధిలో సామూహికంగా పట్నాలు వేశారు. ఒగ్గుడోలు, డమరుకం చప్పుళ్ల మధ్య ఒగ్గు పూజారులు పట్నాలు వేయగా, శివసత్తుల పూనకాలతో మల్లెగుట్ట మార్మోగింది. మండలంలోని గ్రామాలతోపాటు, పెగడపల్లి మండలం నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారికి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు.

ముందస్తు క్రిస్మస్ వేడుకలు


నోట్ బుక్కులు పంపిణీ చేస్తున్న సత్యమూర్తి

కోరుట్ల రూరల్: పట్టణ శివారులోని సంగెం రోడ్డుని జీసస్ క్రైస్ట్ బిలీవర్ చర్చ్‌లో ముందస్తు క్రిస్మస్ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లల ఆటా పాటలు అలరించాయి. అనంతరం 80 మంది సండే స్కూల్ విద్యార్థులకు పలకలు, నోట్ బుక్స్, పెన్నులు, ఎగ్జామ్ ప్యాడ్స్‌ను విశ్రాంత ఉపాధ్యాయుడు సదుల సత్యమూర్తి పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాస్టర్ యస్ .సురేందర్, కే. సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకలకు ముస్తాబు

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేట, తాండ్ర్యాల, కథలాపూర్ గ్రామాల్లోని చర్చీలు క్రిస్మస్ వేడుకలకు ప్రత్యేకంగా అలంకరణ చేస్తున్నారు. విద్యుద్దీపాలు, ప్రత్యేకంగా రంగుల పేయింట్‌లతో ముస్తాబు చేశారు. ఈ నెల 25న క్రిస్మస్ పండుగ ఉండగా.. ఇప్పటి నుంచే ముందస్తు వేడుకలు నిర్వహిస్తున్నట్లు పాస్టర్లు సామ్యేల్, కిషన్ బ్రదర్, నరేశ్ తెలిపారు.

మెట్‌పల్లి: పట్టణ శివారులోని విధిత్‌రెడ్డి గార్డెన్‌లో శనివారం క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చార్జీ జువ్వాడి నర్సింగరావు పాల్గొని పాస్టర్లతో కలిసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు సామెల్ నాయక్, సతీష్, ఏలియో నాగేశ్వర్‌రావు, మేంగు, బేతు గౌతం నాయకులు ఆకుల లింగారెడ్డి, జెట్టి లింగం పాల్గొన్నారు.

గణిత దినోత్సవం


తమ ప్రయోగాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

మెట్‌పల్లి: పట్టణంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో గణిత శాస్త్రజ్ఞుడు రామానుజన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ అంశాలకు సంబంధించిన తయారు చేసిన వాటిని ప్రదర్శించారు. స్థానిక విజ్‌డమ్ హైస్కూల్‌లో ప్లాస్టిక్ రహిత ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. నిఖిల్ భరత్ హైస్కూల్‌లో విద్యార్థుల ప్రదర్శనలను మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు, చైర్‌పర్సన్ రాణవేని సుజాత తిలకించి అభినందించారు.

గణిత ప్రయోగాల ప్రదర్శన

కథలాపూర్: మండలకేంద్రంలోని కళాధార పబ్లిక్ స్కూల్‌లో ఆదివారం విద్యార్థులు గణితం ప్రయోగాలు తయారుచేసి ప్రదర్శించారు. గణితం దినోత్సవం సందర్భంగా ప్రత్యేక వేడుకలు నిర్వహించారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు నిత్య జీవితంలో గణితం వల్ల ఉపయోగాలను సందర్శకులకు వివరించారు. విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ గడ్డం భూమారెడ్డి, హెచ్‌ఎం కమలాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప స్వామి పడిపూజ


పడిపూజ క్రతువు నిర్వహిస్తున్న స్వాములు

వెల్గటూర్ : మండలంలోని చిల్వాకోడూర్‌లో గందె వెంకటేశ్ కన్నెస్వామి గృహంలో అయ్యప్ప పడిపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించగా స్వాములు పేటతుల్లి ఆటలు ఆడారు.

కొనసాగుతున్న మిషన్ భగీరథ పైప్‌లైన్ల నిర్మాణ పనులు



ఇబ్రహీంపట్నం: మండలంలోని వర్షకొండ శివారులో లో లెవల్ వంతెన వద్ద ఆదివారం మిషన్ భగీరథ పైప్‌లైన్ నిర్మాణ పనులను ఇంజినీరింగ్ అధికారులు చేపట్టారు. హైలెవల్ వంతెన నిర్మాణానికి రూ. 4 కోట్లు మంజూరు కావడంతో లో లెవల్ వంతెన పక్క నుండే మిషన్ భగీరథ పైప్‌లైన్ ఉండడంతో పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్ భగీరథ పైపులు తొలగిస్తేనే నిర్మాణ పనులు చేపడుతానని తెలుపడంతో పక్కనే ఉన్న పైప్‌లైన్లు తీసి మరోచోటు నుంచి వేయడానికి నిధులు లేకపోవడంతో ఇటీవల కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ రాజ్యసభ ఎంపీ సురేశ్ రెడ్డి నిధుల నుంచి రూ. 3 లక్షల నిధులు మంజూరు చేయించారు. దీంతో భగీరథ ఇంజినీరింగ్ అధికారులు ఆదివారం లోలెవల్ వంతెన వద్ద పనులను ప్రారంభించారు.

కార్లు ఢీ.. ఒకరికి తీవ్ర గాయాలు

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లా కేంద్రంలోని శ్రీరామ చౌరస్తా వద్ద ఆదివారం మధ్యాహ్నం కారును వెనకనుంచి మరో కారు ఢీకొనగా.. వృద్ధురాలికి తీవ్ర గాయాలయ్యాయి. పట్టణ సీఐ మన్మథరావు సంఘటనా స్థలానికి చేరుకొని ఢీకొట్టిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. కారును పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

అందుబాటులో ఎరువులు

పెగడపల్లి: మండలంలోని నంచర్ల, పెగడపల్లి సహకార సంఘాల ఆధ్వర్యంలో ఎంఆర్పీ ధరలకే వివిధ రకాల ఎరువులు విక్రయిస్తున్నట్లు ఆయా సంఘాల సీఈవోలు మధుకర్, గోపాల్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రోమోర్, యూరియా, పొటాష్, జింక్, సింగిల్ సూపర్ పాస్ఫేట్ ఎరువులు అందుబాటులో ఉన్నాయని, ఎమ్మార్పీ ధరలకు వీటిని విక్రయిస్తున్నట్లు వారు తెలిపారు. అవసరమున్న రైతులు వినియోగించుకోవాలని కోరారు.

బాధిత కుటుంబానికి నిత్యావసర సరుకులు

మల్లాపూర్: దుబాయిలో ఇటీవల జరిగిన బస్సు ప్రమాదంలో మల్లాపూర్‌కి చెందిన మానాల అశోక్ (46) మృతి చెందగా, బాధిత కుటుంబానికి ఆదివారం బీజేపీ రాష్ట్ర నాయకుడు వడ్డెపల్లి శ్రీనివాస్ 50 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మానాల శ్రీనివాస్, రుద్ర రాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద యువతి పెళ్లికి సాయం

సారంగాపూర్: మండలంలోని లక్ష్మీదేవిపల్లిలో నిరుపేద కుటుంబానికి చెందిన గంగాధరి సుజాత, రవి గార్ల కూతురు వివాహానికి ఆదివారం రెడ్డి సంఘం ఆధ్వర్యంలో రూ. 15 వేలు ఆర్థికసాయం చేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, అశోక్, శ్రీధర్, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.